సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 5 । జూలై । 2025



ఇంటికే ఓటరు కార్డు

ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లో ఇంటికే ఓటరు గుర్తింపు కార్డు రానుంది. - 8లో



మొక్కల పెంపకంతోనే..

మొక్కల పెంపకంతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరిచేరవని, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీ సీఈఓ పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు



ఆస్పత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట: సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆస్పత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. వైద్యసిబ్బంది సమయానికి వస్తున్నారా.. రోజూ ఓపీ నమోదవుతుందని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని సూచించారు. కాన్పుల సంఖ్య పెంచాలని, మందుల కొరత లేకుండా చూడాలని, ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. విధులకు గైర్హాజరైన ల్యాబ్ టెక్నీషియన్ రాజుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆయన వెంట పీహెచ్‌ఎస్ సక్కుబాయి, సూపర్‌వైజర్ హేమలత, స్టాఫ్ నర్స్ హరికుమార్ ఉన్నారు.

పాడి రైతులకు అందుబాటులో ఉండాలి



రహీంఖాన్‌పేటలో పాడి రైతుకు సూచనలు చేస్తున్న డీఎల్‌డీఏ ఈఓ రాజశేఖర్

ఆత్మకూరు(ఎం): గోపాలమిత్రలు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌డీఏ ఈఓ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని పశువైద్యశాలను సందర్శించారు. మేలు జాతి ఆడ దూడల ఉత్పత్తి కోసం ప్రత్యేక స్పెమన్ టీకా అందుబాటులోకి వచ్చిందని, దీనిపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రహీంఖాన్‌పేటలో రైతు కొత్త పురుషోత్తంరెడ్డి నిర్వహిస్తున్న పాడి పరిశ్రమను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బండసాయి, గోపాల మిత్ర బండారి సురేష్ ఉన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు వీధిలో ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను అభిషేకం, సహస్ర నామార్చనలతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, స్వామి, అమ్మవారి నిత్యకల్యాణం, ముఖ మండపంలో జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

రూ.లక్షలోపు రుణాలకే మాఫీ వర్తింపు

రాజాపేట: చేనేత కార్మికులకు రుణమాఫీ రూ.లక్ష వరకే వర్తిస్తుందని, ఆ పైబడిన రుణం తీసుకున్న వారు తిరిగి చెల్లించాలని చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూలై 9వ తేదీ నాటికి చెల్లించాలన్నారు. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు లక్ష రూపాయల రుణం తీసుకున్న కార్మికులకు మాత్రమే మాఫీ వర్తిస్తుందన్నారు.

ప్రతి గృహం..
ఇక నందన వనం!

మున్సిపాలిటీల్లో హోం ప్లాంటేషన్

- ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు నాటాలని లక్ష్యం
- జామ ,దానిమ్మ, గులాబీ, కరివేపాకు, కలబందకు ప్రాధాన్యం
- ఇతర ప్రాంతాల నుంచి మొక్కల దిగుమతి
- ఈ నెల రెండో వారంలో కార్యక్రమం



హోం ప్లాంటేషన్ లక్ష్యం ఇలా..

మున్సిపాలిటీ	వార్డులు	గృహాలు	మొక్కలు
ఆలేరు	12	6,008	36 వేలు
పోచంపల్లి	13	5,108	26 వేలు
యాదగిరిగుట్ట	12	5,159	26 వేలు
భువనగిరి	35	15,005	1.60 లక్షలు
మోత్కూరు	12	5,089	26 వేలు
చౌటుప్పల్	20	8,647	43 వేలు

ఆలేరు: మున్సిపాలిటీల్లో ప్రతి గృహం ఇక నందన వనం కానుంది. ఇంటి ఆవరణలు పచ్చదనంతో మినీ గార్డెన్లుగా రూపుదిద్దుకొని ఆహ్లాదం పంచనున్నాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో హోం ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇంటి ఆవరణ, పెరటిలో ఖాళీ స్థలాలు ఉండటం వల్ల అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులకు చెక్ పెట్టి, ఇంటి ఆవరణలను ఆహ్లాదంగా మార్చాలనే ఉద్దేశంతో హోం ప్లాంటేషన్ చేపడుతున్నారు. ఇందులో భాగంగా పుష్పాలు, ఫలాలను ఇచ్చే మొక్కలను ప్రతి ఇంటికీ ఐదు చొప్పున పంపిణీ చేయనున్నారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఇటీవల ఆలేరుకు వచ్చిన సందర్భంలో హోం ప్లాంటేషన్‌పై మున్సిపల్ కమిషనర్, ఆర్పీలు, వార్డు అధికారులకు సూచనలు చేశారు. లక్ష్యం పూర్తి చేసేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. ఈనెల రెండో వారంలో హోంప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి మొక్కలను దిగుమతి చేసుకుంటున్నారు.

పంపిణీ చేయనున్న మొక్కలు ఇవీ..

ప్రతి ఇంటికీ గులాబీ, జామ, కరివేపాకు, కలబంద, దానిమ్మ మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించి హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ)నుంచి ఒక డీసీఎం లోడ్, కొలనుపాక రోడ్డులోని నర్సరీ నుంచి వివిధ రకాల మొక్కలు తీసుకువచ్చారు. ఇందులో పుష్పాలు, ఫలాలను ఇచ్చే మొక్కలతో పాటు నీడనిచ్చే వృక్షజాతి మొక్కలు ఉన్నాయి.

అంతర్గత రోడ్ల పక్కన నీడనిచ్చే మొక్కలు

ఇళ్లతో పాటు ప్రధాన, అంతర్గత రోడ్ల పక్కన కూడా మొక్కలు నాటి సంరక్షించనున్నారు. ఇప్పటికే రోడ్ల వెంట రావి, వేప, అల్లనేరేడు తదితర భారీ వృక్షజాతి మొక్కలు నాటుతున్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా ట్రీగార్డులు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ వార్డుల్లో సుమారు 300 వరకు మొక్కలు నాటారు.



ఆలేరు పట్టణంలోని 7వ వార్డులో రోడ్డు పక్కన నాటిన మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులు

మొక్కలను సిద్ధం చేశాం



అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు హోం ప్లాంటేషన్ కోసం మొక్కలను సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఇంటికి ఐదు రకాల మొక్కలు పంపిణీ చేస్తాం. మొక్కల్లో కొన్ని స్థానిక నర్సరీల నుంచి తీసుకుంటున్నాం. మరికొన్ని రకాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నాం. హోం ప్లాంటేషన్ ద్వారా ప్రతి ఇల్లు నందనవనంగా రూపుదిద్దుకోనుంది.

–జగన్‌మోహన్, ఆలేరు మున్సిపల్ మేనేజర్

హైకోర్టు జడ్జిగా మరొకరు..

- కొండమడుగు గ్రామానికి చెందిన వాకిటి రామకృష్ణారెడ్డి పేరు సిఫార్సు
- జిల్లా నుంచి ఇప్పటికే హైకోర్టు న్యాయమూర్తులుగా కొనసాగుతున్న కలాసికం సృజన, లక్ష్మణ్‌గౌడ్
- గతంలో ఒకరు పదవీ విరమణ



వాకిటి రామకృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి, బీబీనగర్ : కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు న్యాయవాదులు. తాము ఎంచుకున్న మార్గంలో నిరంతర శ్రమతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానానికి చేరుకున్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన వాకిటి రామకృష్ణారెడ్డిని హైకోర్టు జడ్జిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. త్వరలో ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులు కానున్నారు. ఇప్పటికే ఆలేరుకు చెందిన కలాసికం సృజన, రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన కూనూరు లక్ష్మణ్‌గౌడ్ హైకోర్టు న్యాయమూర్తులుగా సేవలందిస్తున్నారు. అంతకుముందు వలిగొండ మండలం నెమలికాల్వ గ్రామానికి చెందిన జస్టిస్ వంగాల ఈశ్వరయ్యగౌడ్ హైకోర్టు జడ్జిగా పనిచేసి పదవీ విరమణ పొందారు.

రామకృష్ణారెడ్డి కుటుంబ నేపథ్యం

వాకిటి రామకృష్ణారెడ్డి 1970 సెప్టెంబర్ 14న జన్మించారు. బీబీనగర్ మండలం కొండమడుగు ఆయన స్వగ్రామం. వారిది వ్యవసాయ కుటుంబం.తండ్రి సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించారు. తల్లి గృహిణి. అన్న, చెల్లి ఉన్నారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఆ తర్వాత అనంతసేన్‌రెడ్డి అనే అడ్వకేట్ వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2005 నుంచి సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టులతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రామకృష్ణారెడ్డి గతంలో బీబీనగర్ మండలంలోని అక్కన్న మాదన్న ఆలయ భూముల కేసులో హైకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో అనుకూల తీర్పువచ్చింది. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, కుటుంబ కేసులు వాదించడంలోనూ సమర్థులుగా పేరుంది. ఇప్పటి వరకు ఆయన వెయ్యి వరకు పిటిషన్లు దాఖలు చేశారు. 2016–17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

విద్యాభ్యాసం

రామకృష్ణారెడ్డి 1నుంచి 7వ తరగతి వరకు కొండమడుగు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివారు. 8నుంచి 10వ తరగతి వరకు బీబీనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని రెడ్డి కళాశాలలో పూర్తి చేశారు. న్యాయవాదిగా హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేశారు. రామకృష్ణారెడ్డిని హైకోర్టు జడ్జిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేయడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

పట్టాలెక్కనున్న డబ్లింగ్ పనులు

బీబీనగర్‌-నడికుడి రెండో లేన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- భూ సేకరణకు గెజిట్ నోటిఫికేషన్ జారీ
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 900 ఎకరాలకు పైగా భూ సేకరణ
- ఆగస్టు నుంచి పనులు ప్రారంభం
- తొలుత నడికుడి మార్గంలో పనులు



బీబీనగర్: బీబీనగర్ – నడికుడి డబ్లింగ్ పనులకు మోక్షం కలిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న సికింద్రాబాద్ – నడికుడి – గుంటూరు రెండో లేన్ పనులకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భూ సేకరణకు సంబంధించి ఈనెల 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టులో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో బీబీనగర్ మండలం గూడూరు నుంచి గుంటూరు జిల్లా నల్లపాడు వరకు డబ్లింగ్ పనులు జరుగనున్నాయి. ముందుగా నడికుడి మార్గంలో 48 కిలో మీటర్ల మేర రూ.647 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించే అవకాశం ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 900 ఎకరాలకు పైగా భూసేకరణకు రైల్వే శాఖ ఆదేశించినట్లు తెలిసింది. బీబీనగర్ మండల పరిధిలోని గూడూరులో 60 ఎకరాలు, భువనగిరి మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, బొల్లేపల్లి, నందనం, అనాజిపురం, పగిడిపల్లి, భువనగిరిలో 830 ఎకరాలకు పైగా భూమి సేకరించనున్నారు,

239 కిలో మీటర్లకు పైగా రెండో లేన్..

బీబీనగర్–గుంటూరు మధ్య రెండో రైల్వే లైన్ పనులకు కేంద్ర కేబినెట్ వ్యవహారాల కమిటీ ఆమోదం తెలుపుతూ 2023లో దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. దీంతో 239 కిలో మీటర్లకు పైగా రెండో లైన్ నిర్మాణానికి రూ.2,853.23 కోట్లు కేటాయించింది. ఇందులో సివిల్ పనులకు రూ.1,947.44 కోట్లు, ఇంజనీరింగ్ నిర్మాణ పనులకు రూ.588.17కోట్లు, సిగ్నలింగ్ టెలికాం పనులకు రూ.319.62 కోట్లు అంచనా వ్యయంగా చూపారు. 2024 ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ ముగిసింది. తదుపరి కాంట్రాక్టర్ ఎంపిక, ఈసీసీ ఆమోదంతో ఒప్పందం జరగాల్సిన ప్రక్రియ కొనసాగుతున్నట్లు, ఆగస్టు నుంచి పనులు ప్రారంభంకావచ్చని రైల్వే అధికారుల నుంచి సమాచారం.

పెరగనున్న ప్రయాణికుల రద్దీ

బీబీనగర్–గుంటూరు రెండో లైన్ అందుబాటులోకి వస్తే తెలుగు రాష్ట్రాల మధ్య రద్దీ పెరగనుంది. తిరుపతి, చెన్నై, ఖమ్మం తదితర ప్రాంతాలకు బీబీనగర్–నడికుడి–గుంటూరు మార్గం దగ్గరగా ఉండటం, డబ్లింగ్‌తో రైళ్ల వేగం పెరగనుండడంతో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు బీబీనగర్–గుంటూరు మార్గం సింగిల్ ట్రాక్ లేన్ కావడంతో ఒక రైలు వస్తే మరో రైలును ముందు స్టేషన్‌లో నిలిపేవారు. రెండో లేన్ అందుబాటులోకి వస్తే రైలు నిలపడం, ప్రయాణికులకు వేచి వుండే ఇబ్బందులు తొలగనున్నాయి.

సుప్రీంకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో స్థానిక న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను శుక్రవారం స్థానిక న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. న్యాయమూర్తిని సన్మానించి, శ్రీస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన జడ్జి జయరాజ్, యాదగిరిగుట్ట కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూదగాని శ్రీహరిగౌడ్, న్యాయవాదులు గుడ్ల స్వామి, పెంట రమేష్, ఈరేని కృష్ణ, డి.గణేష్, డి.వీరస్వామి, రేణుక, సంతోష పాల్గొన్నారు.

నిధులు స్వాహా..!

- కొండమడుగులో పంచాయతీ నిధులు, రఘునాథపురంలో ఉపాధిహామీ బిల్లులు పక్కదారి
- విచారణలో తేలినా చర్యలు శూన్యం

సాక్షి, యాదాద్రి : పలు పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టాయి. ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదులపై విచారణ చేయగా వాస్తవాలు వెలుగుచూశాయి. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామ పంచాయతీలో రూ.95 లక్షల వరకు దుర్వినియోగం అయ్యాయి. 2022–23, 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో వివిధ స్థాయిల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లులను.. ఓచర్లు, ఎంబీ రికార్డు చేయకుండానే రూ.53 లక్షలు చెల్లించినట్లు తేలింది. మరో రూ.42 లక్షలు వివిధ పనుల రూపేణా సంబంధం లేని వ్యక్తులకు చెల్లించారు. నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులు అందడంతో మూడు నెలల క్రితం డీఎల్‌పీఓ విచారణ చేశారు. నిధులు దారి మళ్లినట్లు తేలినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఉపాధి బిల్లులు రూ.10 లక్షలు ఇతర ఖాతాల్లోకి..

రాజాపేట మండలం రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్‌కుమార్ ఉపాధిహామీ పథకంలో పనులు చేయించారు. ఇందుకు సంబంధించిన బిల్లులు రూ.10 లక్షలు రావాల్సి ఉంది. ఎంపీడీఓ, జూనియర్ పంచాయతీ కార్యదర్శి అట్టి నిధులను ఇతర ఖాతాలకు మళ్లించి ఖర్చు చేశారని శ్రవణ్‌కుమార్ ఏప్రిల్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు విచారణ చేయడం లేదు.

సీఎంఆర్ బకాయిలు అప్పగించండి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : 2023–24 యాసంగి సీఎంఆర్ బకాయిలను తక్షణమే అప్పగించడంతో పాటు.. 2024–25 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన బియ్యం ఎగుమతులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో జరిగిన రైస్ మిల్లర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా సకాలంలో బియ్యం ఇవ్వాలని సూచించారు. అవసరం మేరకు గోదాములను సిద్ధం చేసుకుని అధికారులకు సహకరించాలని కోరారు. జిల్లాలో స్థలం కొరత ఉన్నందున ప్రత్యామ్నాయంగా నల్లగొండ జిల్లా చిట్యాలలోని గోదామును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ అధికారులకు సూచించారు. బియ్యం రవాణా సులభతరం చేసేందుకు రైల్వే వ్యాగన్లను పెంచాలన్నారు. సమావేశంలో ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ అధికారులు, గోదాముల యజమానులు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ల నివేదిక ఇవ్వండి

వానాకాలం సీజన్ కోసం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లకు సంబంధించి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించడానికి ఈసారి జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సివిల్ సప్లై అధికారులు హరికృష్ణ, రోజారాణి, మార్కెటింగ్ అధికారి సబిత తదితరులు అధికారులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం



దొడ్డి కొమురయ్య, రోశయ్య చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ హనుమంతరావు కొనియాడారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అధికారులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయని గొప్ప యోధుడు కొమురయ్య అని కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికశాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్, ఉద్యోగులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ‘ఉపకారం’

- దరఖాస్తులు కోరుతున్న కేంద్రం
- గరిష్టంగా రూ.25 వేలు అందజేత
- జిల్లాలో సుమారు 6 వేల మంది విద్యార్థులు



ఆలేరు: బీడీ కార్మికుల పిల్లలు చదువులో రాణించేలా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ చేయూతనిస్తోంది. 1వ తరగతి నుంచి ఎంబీఏ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల వరకు అండగా నిలుస్తోంది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. కనిష్ఠంగా రూ.వెయ్యి, గరిష్ఠంగా రూ.25వేలు అందజేస్తూ వారికి ఉన్నత విద్యకు బాటలు వేస్తోంది. 2025–2026 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 3వేల వరకు బీడీ కార్మికులు ఉన్నారు. ఆయా కుటుంబాలకు చెందిన సుమారు 6వేల మంది పిల్లలు వివిధ స్థాయిల్లో విద్యనభ్యసిస్తున్నారు.

దరఖాస్తు గడువు..

అర్హులైన విద్యార్థులు scholarshi p.gov.in వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలు నమోదు చేయడంతో పాటు అవసమైన ధ్రువీకరణ పత్రాలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి. ఇకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోపు, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర వృత్తి విద్య కోర్సులు, ఎంబీఏ, ఎంబీబీఎస్, బీఏఎంఎస్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పూర్తి వివరాలు, సందేహాల నివృత్తికి 040–25561297 లేదా ఆలేరులోని మంతపురి రోడ్డులో గల బీడీ కార్మికుల ఆస్పత్రిలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉపకార వేతనం.. (రూ.ల్లో)

తరగతి, కేటగిరీ	స్కాలర్‌షిప్
1–4 తరగతులు	1,000
5నుంచి 8	1,500
9నుంచి 10	2,000
ఇంటర్మీడియట్	3,000
డిగ్రీ, పాలిటెక్నిక్ ఇతర వృత్తివిద్య కోర్సులు	6,000
ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంబీబీఎస్, బీఏఎంఎస్	25,000

అర్హతలు ఇవీ..

- 2025లో తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం.
- కుటుంబ ఆదాయం నెలకు రూ.10,000 లోపు ఉండాలి.
- విద్యార్థి పేరిట బ్యాంక్ ఖాతా.
- గత సంవత్సరం చదివిన తరగతి, కోర్సుకు సంబంధించిన మార్కుల మెమో
- టెన్త్, ఇంటర్మీడియట్‌లో నేరుగా ఉత్తీర్ణులై ఉండాలి. సప్లిమెంటరీ విద్యార్థులు అనర్హులు.
- దూరవిద్య అభ్యసించిన వారు అనర్హులు.
- తండ్రి లేదా తల్లికి పీఎఫ్ గుర్తింపు కార్డు తప్పనిసరి.

అవగాహన లేమి..

బీడీ కార్మికుల పిల్లలకు జాతీయస్థాయిలో ఉపకార వేతన స్కీం ఎప్పటినుంచో అమల్లో ఉంది. అయినా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు, కొన్ని సందర్భాల్లో వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, దరఖాస్తు అప్‌లోడ్ కాకపోవడం వంటి సమస్యల వల్ల చాలామంది ఉపకార వేతనం పొందలేకపోతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.200–రూ.300 వరకు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు అప్‌లోడ్ అవకపోతే తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా బీడీ కార్మికుల పిల్లల కోసం కేంద్రం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందన్న విషయం చాలా మందికి తెలియదు. దీనిపై ప్రచారం కల్పించాలని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సద్వినియోగపర్చుకోవాలి



బీడీ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఏటా ఉపకార వేతనాలు మంజూరు చేస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలుంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలి.

–నిఖిల, బీడీ కార్మిక ఆస్పత్రి వైద్యాధికారి, ఆలేరు

క్లుప్తంగా

యాదగిరి క్షేత్రానికి ఆషాఢం ఎఫెక్ట్

- గణనీయంగా తగ్గిన భక్తుల రద్దీ



భక్తులు లేక వెలవెలబోతున్న ఉత్తర మాడవీధి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. ఆషాఢ మాసం ప్రారంభంకావడంతో పాటు అటు గ్రామాల్లో వ్యవసాయం పనుల్లో రైతులు బిజీబిజీగా ఉండటం .. ఇటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్తుండటం, జంట నగరాల్లో బోనాల పండుగ ప్రారంభం కావడంతో భక్తుల రాక తగ్గింది. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు వెలవెలబోయాయి. స్వామివారి దర్శనానికి 30 నిమిషాల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. శుక్రవారం స్వామివారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.12,15,624 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి బలవన్మరణం



మత్స్యగిరి (ఫైల్)

చిట్యాల: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో శుక్రవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలికట్టె గ్రామానికి చెందిన జక్కలి మత్స్యగిరి(22) చిట్యాల మండలంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్ద బర్రెలను కట్టేసి రావటానికి వెళ్లి పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గుర్తించి అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య మహేశ్వరీ, ఒక కుమారుడు ఉన్నారు. తన భర్త కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు మత్స్యగిరి భార్య మహేశ్వరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కాంగ్రెస్ సభకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

- కారును ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి
- కట్టంగూరు మండలం పామనగుండ్ల వద్ద ఘటన
- మృతుడు మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం వాసి

హుజూర్‌నగర్: హైదరాబాద్‌లో కాంగ్రెస్ సభకు వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన కట్టంగూరు మండలం పామనగుండ్ల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెంకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ సభకు కారులో వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో పామనగుండ్ల శివారులోకి రాగానే కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన గుంతలో పడిపోయింది. కారును ఢీకొట్టిన లారీ వెళ్లిపోయింది. వెనుక వస్తున్న వారు గమనించి గాయపడిన వారిని పరిశీలించగా అప్పటికే కుర్రి శ్రీను(40) మృతిచెందాడు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

15 రోజుల్లో.. ఇంటికే ఓటరు కార్డు

- కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఓటరు నమోదును ప్రోత్సహించడానికి సరికొత్త మార్గం



దేవరకొండ: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంతో పాటు 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోనే ఇంటికే ఓటరు గుర్తింపు కార్డులు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో యువతను చైతన్యపర్చేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

మార్పులు చేర్పులు సైతం..

అంతేకాకుండా ఇదివరకే ఓటరుగా నమోదై ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సైతం 15రోజుల్లోనే ఇంటికే ఓటరు కార్డు పంపించనున్నారు. ఇప్పుడు ఉన్న సిస్టం ప్రకారం ఓటర్లకు ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెలకు పైగా సమయం పడుతుంది. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టింది.

దరఖాస్తు ఇలా..

18ఏళ్లు నిండి ప్రతిఒక్కరూ ఈసీఐ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీతో సైన్అప్ కావాలి.

- క్రియేట్ చేసిన అకౌంట్‌పై క్లిక్ చేసి తన పేరు, పాస్‌వర్డ్ నమోదు చేయాలి. తర్వాత పాస్‌వర్డ్‌ను నిర్ధారించాలి.
- సైన్ అప్ అయిన ఈమెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దానిని ఎంట్రీ చేసి అందులో ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలి.
- తర్వాత మొబైల్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవ్వాలి.
- కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారు ఫారం-6తో వ్యక్తిగత వివరాలు, అడ్రస్ తదితర వివరాలు నమోదు చేసి అందులో పేర్కొన్న ధృవపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం మరోసారి వివరాలను సరిచూసుకొని సబ్మిట్ చేయాలి.
- మార్పులు, చేర్పుల కోసం ఫారం-8, ఓటరు పేరు తొలగించుకునేందుకు ఫారం-7 నింపాలి.
- ట్రాక్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేస్తే దరఖాస్తు చేసిన సమయంలో ఎస్ఎంఎస్‌గా వచ్చిన రెఫరెన్స్ నమోదు చేసి సబ్మిట్ చేస్తే అప్లికేషన్ స్టేటస్ ఎంతవరకు వచ్చిందో తెలుస్తుంది.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి



అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును పొందాలి. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అర్హులకు 15రోజుల్లోనే గుర్తింపు కార్డు రానుంది.

– రమణారెడ్డి, ఆర్డీఓ, దేవరకొండ

ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు గురుకుల విద్యార్థి



ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద జాతీయ జెండాను చూపుతున్న విద్యార్థి రామకృష్ణారెడ్డి

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలో కొనసాగుతున్న హైదరాబాద్‌లోని మలక్‌పేట, కార్వాన్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి జి. రామకృష్ణారెడ్డి ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు చేరుకున్నాడు. గత నెల మన రాష్ట్రం నుంచి 20మంది విద్యార్థుల బృందం అడ్వెంచర్ క్యాంప్‌లో భాగంగా ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహించడానికి వెళ్లారు. అందులో రామకృష్ణారెడ్డి కూడా బేస్ క్యాంపునకు చేరుకుని జాతీయ పతాకంతో పాటు మహాత్మాబా పూలే గురుకుల పాఠశాలల జెండాను ఎగురవేశారు. రామకృష్ణారెడ్డి స్వస్థలం గద్వాల జిల్లా గట్టు మండలం మిట్టదొడ్డి గ్రామం. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డిని శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. వెంకట్రావ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ హరికుమార్, డిప్యూటీ వార్డెన్ అజార్, ఫిజికల్ డైరెక్టర్ పి. హేమంత్‌కుమార్, సతీష్, హౌజ్ మాస్టర్ రాజ్‌కుమార్, రవి, శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ, చిత్రంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: ఆస్తి వివాదంలో కన్న తండ్రిని హత్య చేసిన నిందితుడిని శుక్రవారం మోతె పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె. నరసింహ విలేకరులకు వెల్లడించారు. మోతె మండలం నాగయ్యగూడేనికి చెందిన నిమ్మరబోయిన వెంకన్నకు 4.29 ఎకరాల భూమి ఉంది. ఐదు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో తీర్మానం చేసి వెంకన్న తన పేరిట ఎకరం, ఇద్దరు కుమారులకు చెరొక ఎకరంన్నర, కుమార్తెకు 29 గుంటల భూమి వాటాలు వేసి పంచుకున్నారు. అయితే ఈ భూమిని పట్టా చేయలేదు. వెంకన్న తన వాటాకు వచ్చిన ఎకరం భూమిని తనకు అప్పులు అయ్యాయని అమ్ముకున్నాడు. దీంతో వెంకన్నపై అతడి పెద్ద కుమారుడు గంగయ్య కోపం పెంచుకొని ఎలాగైనా అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం గంగయ్య తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో తన తండ్రి వెంకన్న సూర్యాపేట నుంచి నాగయ్యగూడేనికి టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండటం గమనించాడు. అదే సమయంలో గంగయ్య తన తలకు హెల్మెట్ ధరించి తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో తండ్రి వెంకన్నపై దాడి చేసి పారిపోయాడు. వెంకన్నను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మోతె పోలీసులు శుక్రవారం గంగయ్యను మామిళ్లగూడెం ఎక్స్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి గొడ్డలి, హెల్మెట్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో బావ, బావమర్ది మృతి



ఐలయ్య (ఫైల్)



భిక్షం (ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): మామ అంత్యక్రియలకు హాజరైన వ్యక్తి.. తన బావమరిదితో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్లు గ్రామానికి చెందిన మోరపాక భిక్షం అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. భిక్షం అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అతడి అల్లుడు మోనంది ఐలయ్య(55) గురువారం సూర్యాపేట నుంచి గట్టికల్లుకు వచ్చాడు. కొన్ని కారణాల వల్ల గురువారం భిక్షం అంత్యక్రియలు పూర్తికాలేదు. కాగా గురువారం రాత్రి 8గంటల సమయంలో మోనంది ఐలయ్య తన బావమరిది(మృతుడి కుమారుడు) మోరపాక రాములు(45)తో కలిసి పని నిమిత్తం టీవీఎస్ మోపెడ్‌పై గట్టికల్లు నుంచి నెమ్మికల్లుకు వెళ్తున్నారు. అదే సమయంలో గట్టికల్లు గ్రామానికే చెందిన కోన వినోద్ తన తల్లి, కుమారుడితో కలిసి సూర్యాపేట నుంచి బైక్‌పై గట్టికల్లుకు వస్తున్నాడు. ఈ క్రమంలో నెమ్మికల్లు–గట్టికల్లు గ్రామాల మధ్య వినోద్ తన బైక్‌తో ఎదురుగా వస్తున్న ఐలయ్య టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐలయ్య, రాములుకు తీవ్ర గాయాలు కాగా.. వినోద్ తల్లి లక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఐలయ్య, రాములు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఐలయ్య, సాయంత్రం రాములు మృతిచెందారు. మృతుడు మోనంది ఐలయ్య స్వగ్రామం గట్టికల్లు కాగా.. 15 ఏళ్లుగా సూర్యాపేటలో నివాసముంటున్నాడు. ఐలయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మోరపాక రాములు భార్య గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. రాములుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బైక్‌తో ఢీకొట్టి ఐలయ్య, రాములు మృతికి కారణమైన వినోద్‌పై కఠిన చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు శుక్రవారం వినోద్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గట్టికల్లు గ్రామానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒక్కరోజు వ్యవధిలో మృతిచెందడంతో గట్టికల్లు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలికపై అత్యాచారం కేసులో 22 ఏళ్లు జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేసి మోసం చేసిన కేసులో నిందితుడికి 22 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు రెండవ అదనపు జడ్జి రోజారమణి శుక్రవారం తీర్పు వెల్లడించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన అల్లం మహేష్ 2014 సంవత్సరంలో బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. బాలిక గర్భం దాల్చడంతో.. బాధితురాలు తండ్రి వాడపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితునికి 22 సంవత్సరాలు జైలు రూ.35000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం త్వరితగతిన చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఏడు పాడి గేదెలు మృతి



మృతిచెందిన పాడి గేదెలు

నడిగూడెం: నడిగూడెం మండలం రామాపురం గ్రామ పరిధిలోని ఊర చెరువులో విద్యుత్ తీగలు తగిలి ఏడు పాడి గేదెలు మృతిచెందాయి. వివరాలు.. రామాపురం గ్రామంలోని పలువురు రైతులకు చెందిన ఏడు పాడి గేదెలు శుక్రవారం మేత మేసేందుకు గ్రామ పరిధిలోని ఊర చెరువు వద్దకు వెళ్లాయి. చెరువులో విద్యుత్ తీగలు తెగిపడడంతో ఆ తీగలకు ఏడు గేదెలు తగలడంతో మృతిచెందాయి. బూతుకూరి రామిరెడ్డికి చెందిన 3, నేలమర్రి శ్రీనుకు చెందిన 2, తొడేటి శ్రీను, బంక శంకర్‌కు చెందిన ఒక్కో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే గేదెలు మృతిచెందాయని గ్రామస్తులు ఆరోపించారు.

రైల్లో నుంచి జారిపడి మృతి

నల్లగొండ: రైల్లో నుంచి జారి పడి విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ అభినవ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన పీఎస్ రుత్విక(18) హైదరాబాద్ నుంచి శుక్రవారం సాయంత్రం చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తోంది. రాత్రి 7గంటల సమయంలో నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రుత్విక రైలులో నుంచి జారిపడి మృతిచెందింది. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బొడిగ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

లక్కీ డ్రా స్కీం కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ అర్బన్: లక్కీ డ్రా స్కీం పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన ముగ్గురు నిందితులను మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను శుక్రవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ విలేకరులకు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలో నివాసముంటున్న అడవిదేవులపల్లి మండలం ముదిమానిక్యం గ్రామానికి చెందిన కొమ్ము రమేష్, కొమ్ము కోటేశ్వర్‌రావు, దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన బచ్చలకూరి శ్రీను కలిసి ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థను స్థాపించారు. అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుని నెలకు రూ.1000 చొప్పున 15నెలలు కడితే ప్రతి నెల డ్రా తీసి డ్రాలో వచ్చిన పది మందికి రూ.15వేల విలువైన వస్తువులు ఇస్తామని ఆశ చూపారు. 15నెలల్లో డ్రా లో పేరు రాకున్నా.. చివరకు కట్టిన మొత్తానికి అంత విలువైన వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. వారు కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారికి కమీషన్ ఆశచూపి వారి ద్వారా 2143 మందిని లక్కీ డ్రా స్కీంలో చేర్పించుకున్నారు. వారి నుంచిరూ.1.85 కోట్లు వసూలు చేసి అందులోంచి రూ.50 లక్షల వరకు డ్రాలో గెలిచిన సభ్యులకు గిఫ్టుల రూపంలో అందజేశారు. స్కీం పూర్తయిన తర్వాత మిగిలిన వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో నిందితులను అరెస్ట్ చేశారు. బాధితుల నుంచి వసూలు చేసిన రూ.1.36 కోట్లతో నిందితులు ప్లాట్లు, విలువైన ఇంటి సామగ్రి కొనుగోలు చేసి చేసినట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.6,55,500 నగదు, రెండు ఓపెన్ ప్లాట్లు, ఇంటి దస్తావేజులు, ముదిమానిక్యం గ్రామంలో లీజుకు తీసుకుని నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ దస్తావేజు, ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ ఆఫీస్‌లో ఫర్నీచర్, రెండు ద్విచక్ర వాహనాలు, వాషింగ్ మెషిన్, వాటర్ ప్యూరీఫయర్, లాప్‌ట్యాప్, కంప్యూటర్, బాధితులకు ఇవ్వడానికి తయారు చేసిన బ్రోచర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె. రాజశేఖర రాజు, సీఐ మోతీరాం, ఎస్ఐ సైదిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే సమృద్ధిగా వర్షాలు

- ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటిన వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించే బాధ్యత తీసుకుంటామని, మొక్కల పెంపకంతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ సైన్స్ కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎంజీయూ ఆవరణలో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యతగా యూనివర్సిటీతో పాటు తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, ఆకుల రవి, స్పోర్ట్స్ సెక్రటరీ కె. హరీష్‌కుమార్, వీరస్వామి, సుధాకర్, శ్రీనివాస్, షరీఫ్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్

- 11.780 కిలోల గంజాయి స్వాధీనం
- పరారీలో మరో నలుగురు



సూర్యాపేటటౌన్: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన పది మంది యువకులు ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వారిలో పిట్టల నాగరాజు, ఆది వంశీ జూన్ 30న సూర్యాపేట నుంచి బస్సులో ఖమ్మంకు వెళ్లి.. అక్కడి నుంచి రైలులో ఏపీలోని విశాఖపట్నం సమీపంలోని అరకు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ 12కిలోల గంజాయిని ఒక్కో కిలో రూ.2వేలు చొప్పున కొనుగోలు చేశారు. ఈ గంజాయి కొనుగోలు చేయడానికి పది మంది యువకులు కలిసి ఒక్కొక్కరు రూ.3వేల చొప్పున వేసుకున్నారు. నాగరాజు, వంశీ కలిసి ఆ గంజాయిని తీసుకొని ఈ నెల 3న సూర్యాపేటకు వచ్చి నాగరాజు ఇంట్లో దాచిపెట్టారు. ఆ గంజాయిని అందరికీ పంచేందుకు నల్లచెరువుకట్ట వద్దకు రమ్మనగా వారందరూ గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో అక్కడికి చేరుకున్నారు. నాగరాజు నల్లచెర్వుకట్ట వద్దకు బైక్‌పై గంజాయితో రాగా.. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా సీసీఎస్, పట్టణ సీఐ వెంకటయ్య తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో పిట్టల నాగరాజు, అంగోతు వంశీ, రెడ్డిపల్లి మధుసూదన్, కూతురు ఆకాశ్, శూర శ్రవణ్‌కుమార్, గుండారపు శివ ఉండగా వారిని రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు ఆది వంశీ, విశ్వనాథుల సాయికుమార్, దోసపాటి వంశీ, సారగండ్ల శివకార్తీక్ పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వివరించారు. నిందిథితుల నుంచి 11.780కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొరకుంటలో గంజాయి పట్టివేత..?

కోదాడరూరల్: కోదాడ మండలం దొరకుంటలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి పోలీసులు 10 కేజీల గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేయగా ఓ వ్యక్తి వద్ద కొంత మేర గంజాయి పట్టుబడినట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. సదురు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు మరో వ్యక్తి వద్ద 9 కేజీల గంజాయి పట్టుబడినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

గరిడేపల్లిలో మరో నలుగురు..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పక్కన సీఐ చరమందరాజు, ఎస్ఐ నరేష్

హుజూర్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 2.350 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం హుజూర్‌నగర్ సీఐ కార్యాలయ ఆవరణలో ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి విలేకరులకు వెల్లడించారు. హుజూర్‌నగర్‌కు చెందిన బొట్ల బాలకృష్ణ, షేక్ నజీర్, కొప్పుల శ్రీకాంత్ శుక్రవారం గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులోని కాల్వపల్లి రోడ్డు పక్కన డంపింగ్ యార్డ్ వద్ద గంజాయి క్రయవిక్రయాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడ మాటువేశారు. ఈ క్రమంలో పల్సర్ బైక్‌పై వారు ముగ్గురు వచ్చి గంజాయి ప్యాకెట్లను పంచుకుంటుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 330 గ్రాముల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని గంజాయి అమ్మిన చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపవరపు శ్రీకాంత్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా నెల రోజుల క్రితం ఏపీలోని సీలేరు వెళ్లి కార్తీక్ అనే వ్యక్తి నుంచి రూ.8వేలు ఇచ్చి 4కేజీల గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో తాను సేవించి మిగిలిన దానిని బొట్ల బాలకృష్ణ, షేక్ నజీర్, కొప్పుల శ్రీకాంత్‌కు గత నెల 29న ఒకసారి, శుక్రవారం మరోసారి విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, 2.30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆలోచనా దృక్పథం అవసరం



మాట్లాడుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: నూతన ఆలోచనా దృక్పథం ప్రతి విద్యార్థికి అవసరమని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండలోని ఎంజీయూలో శుక్రవారం విద్యార్థులకు మేధో సంపత్తి హక్కులపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల వినూత్న ఆలోచనకు క్రమశిక్షణ తోడైతే శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చన్నారు. సామాజిక సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు నివేద, శ్రీచరణ్ తేజ మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐపీఆర్ సెల్ డైరెక్టర్ దోమల రమేష్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రేమ్‌సాగర్, రామచందర్ గౌడ్, మద్దిలేటి, తిరుమల, శాంతకుమారి, మచ్చేందర్ పాల్గొన్నారు.

సాగర్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌ను శుక్రవారం కేంద్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం, పర్యవేక్షణ నిర్వహణ బృందం సభ్యులు సందర్శించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన డ్యాంను సందర్శించిన అనంతరం బుద్ధవనంలోని బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధ చరిత వనం, ధ్యానవనం, జాతకవనం, స్తూపవనాలను సందర్శించారు. మహాస్తూపం రెండో అంతస్తులో ధ్యాన మందిరంలో బుద్ధ భగవానుడి వద్ద బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన ఈ బృందంచే బుద్ధజ్యోతిని వెలిగించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు. ఈ బృందంలో నావెల్ ప్రకాష్, అభిషేక్ విశ్వాస్, బీపీ యాదవ్, సందీప్‌కుమార్, బీఆర్ సలేమాన్, బీపీఎం మోహన్‌రెడ్డి, రెవెన్యూ ప్రొటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.